
# కోమాలాంటి




హరిబాబు

వేరాడు. అంతా నిశ్శబ్దంగా ఉంది. తల్లి ఒక్కతే వంటింట్లో పాటుపడుతున్నది. పిల్లలిద్దరూ వంటింటి గుమ్మంలో కూర్చొనున్నారు.

తమ్ముడినిచూసి లోపలికి వచ్చాడు బలరామయ్య. ఎలా ప్రస్తావించాలని ఆలోచిస్తుండగానే వాసుదేవపతి పారిజాతాన్ని పిలుస్తూ వంటింటి

## కోతుల లాటి

27 వ పేజీ తరువాయి

వైపు వెళ్ళాడు. తండ్రి కేక విని గబగబా ఎప్పు కాళ్ళకు చుట్టుకున్నాడు మాధవుడు. వాడి నెత్తు కొంటూ, "అమ్మ ఏదిరా!" అన్నాడు వాసుదేవపతి.

"అమ్మ బబ్బుంది నాన్నా!" అని గది వైపు చూపాడు మాధవుడు.

వాసుదేవపతి గదిలోకి వెళ్ళి పారిజాతంపైన చెయ్యి వేసి—"ఏమే ఒంట్లో బాగోలేదా?" అన్నాడు

"చావొక్కటి రాలేదని చూస్తున్నా!" అన్నది అక్కసుగా.

వాసుదేవపతికి అర్థం కాలేదు.

"ఏమిటే నీ ముఖం? ఏమొచ్చింది" అన్నాడు.

పారిజాతం రుక్మిణమ్మమీద చిలవలు పలవలు చేసి చెప్పింది. బావగారు భార్యను వెంట వేసుకొనివచ్చి పోట్లాడింది చెప్పి—"అత్తగారు ఎదురుగా ఉన్నారు. కొడుకును ఒక్క మాట అనలా—" అన్నది చివరకు ఏడుస్తూ.

"నువ్వేమన్నావు?—" అనడిగాడు ప్రశాంతంగా.

"నేనేమంటాను—నేను లేని దాన్నే. కాని ఇంత సంపాదించే మగవారి చేతిలో ఉన్నా. వారే దిక్కు అన్నాను.

"అన్న—" అని చెప్పబోతుండగా.

"ఇంకేమంటారు ఆయన. మాట్లాడావంటే నాలుక తెగగోస్తాను జాగ్రత్త అన్నారు—" అన్నది పారిజాతం.

వాసుదేవపతి మెల్లగా గది బయటకు వస్తుండగా పారిజాతం అతడికి వినపడేలా—"ఇక తప్పదు. నే బ్రతికున్నంత కాలం కుక్కిన పేనులా కుక్క బతుకు బతకాల్సిందే లాగుంది. దీని బదులు చావైనా రాదు" అన్నది వెక్కి వెక్కి ఏడుస్తూ.

వాసుదేవపతి వెనక్కి తిరిగిచూసి నీళ్ళ గదిలోకి వెళ్ళిపోయాడు.

బలరామయ్య తిరిగి అరుగుమీద చేరి కూతురితో తమ్ముడికి కబురు చేసాడు.

"ఏం అన్నయ్యా పిలిచావా?" అన్నాడు వాసుదేవపతి వచ్చి అరుగుమీద కూర్చుంటూ.

ఒక్క క్షణం మాట్లాడకుండా కూర్చొని తమ్ముడి వైపు చూడకుండానే—"పారిజాతం చాల దురుసుగా ప్రవర్తించిందిరా వసూ!" అన్నాడు.

"పోనీలే అన్నయ్యా! ఏమీ పట్టించుకోకు" అన్నాడు వాసుదేవపతి నెమ్మదిగా.

బలరామయ్యకు ఇంకా కోపం తగ్గలేదు. రుస రుస లాడుతూ లేచి "దానికి బుద్ధి చెబుతూ గట్టిగా కేక లెయ్యి. లేకపోతే అది మరీ ఎదిరించి మాట్లాడుతుంది" అన్నాడు.

"మనం ఆడవాళ్లమీద కేక లేస్తే అంత బాగోదన్నయ్యా — ఆడవాళ్లూ ఆడవాళ్లూ ఏవో అనుకున్నారు. వాళ్లతో మనం కలియబడటం బాగోదు." అన్నాడు వాసుదేవపతి తిరిగి నెమ్మదిగా.

ఎప్పుడు నిలబడిఉందో తలుపు ప్రక్కనుండి రుక్మిణమ్మ—"ఏం? బావగారు ఆమాత్రం కోప్పడ కూడదూ మరదల్ని. అంత ఎదిరించి సమాధానం చెబుతుందేం?" అన్నది గట్టిగా.

బలరామయ్య అక్కడనుండి లేచి భార్య వంక చూసి "నువ్వు లోపలికి పో" అని కసిరి తమ్ముడి వంక చూస్తూ, "నాకు తెలుసురా వసూ! నీ పెళ్ళాం నీకు నూరిపోసింది. నువ్వేమనుకుంటున్నావో చెప్పు. చక్కగా చేద్దాం—నేను ఎందూకూ పనికి రాని వాడినని నీ పెళ్ళాం అంది. సరే! ఈ సంసారాన్నంతా నువ్వే ఇవాళ దాకా గడిపావు అంతేనా!"


ఋతుక్రమం ఆలస్యమైతే?

విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన "దేవి పిల్సు" వాడండి

పూర్తికోర్సు ప్యాకెట్టు 28 మాత్రలు వెల రు 11/-
సగం కోర్సు ప్యాకెట్టు 14 మాత్రలు వెల రు 6/50
వి.పి. ఖర్చు అదనము
ప్రతి చోట దొరకును




దేవి పిల్సు ముఖ్యంగా ఆలస్యమైన, క్రమముగాకాక పోయిన, బాధతోకూడిన, లేక ఆగిపోయినబహిష్టకు దేవి పిల్సు బాగుగ గుణమిచ్చును

1 అన్ని సందర్భములలోను శీఘ్రముగాను, అమోఘముగాను పనిచేయును
2 ప్రస్తుతిలోను, ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగింపవు

MANUFACTURERS SEENU & CO., MADRAS-21 | Selling Agents: DEVI AGENCIES, MADRAS-21

స్టాకిస్టులు: మెస్సర్స్. డి. జె. ఫరీక్ & కం., సుభాష్‌రోడ్, సికిందరాబాద్.



ఆదాయము కావాలంటే



ఇంటింటా కుట్టు పని నేర్చి మీ సొమ్ము ఆదా చేయండి. నేర్చు కొనుటకు ప్రత్యేక గ్రంథం—అందరు టైలర్లే రు. 5/- 266 పే. 180 బొమ్మలు, అందమైన ఫుల్ క్యాలికో బైండు. బోధింపు రు. 3-50. కత్తిరింపులు రు. 1/-. రహస్య బోధిని రు. 0-62. రు 4 తెలుగు. వి. పి. అదనము.
జి. పున్నారావుచౌదరి, మోపర్రు, తెనాలి తా.



RATNAM'S N-OIL

(పై పూతకు మాత్రమే)

అంగనరములు: బలహీనత చెంది, చిన్నదైనచో తిరిగి యధాప్రకారం అయిపూర్తి సౌఖ్య మనుభవించుటకు: 50 సం॥ ప్రఖ్యాతి గలది. 1 సీసా రూ. 10/-లు వి. పి. 1-50. కావలసినవారు ఎడ్వాన్సు పంపేది ఇందులో స్పెషల్ రకం అర్జంటు గుణమునకు రూ. 25-00 లు వి. పి. రూ. 2-00.

డాక్టర్ రత్నం సన్స్, (Estd 1904)
మలకపేట బిల్డింగ్, ఆజంపూరా మార్కెట్‌వద్ద, హైదరాబాద్-24 (ఆంధ్రప్రదేశ్)





అన్నాడు కోపంగా.

"అదంతా ఇప్పు డెందుకన్నాయ్యా? అన్నీ మరిచిపో" అన్నాడు వాసుదేవపతి విసుగ్గా.

లోపలికి చరచరా పోయాడు. బలరామయ్య. వసారాలోంచి గట్టిగా తల్లిని కేక వేసాడు. ఆవిడ రాగానే ఆవిడ వంక చూస్తూ, "చిన్ని కోడలన్న మాటలు నేనెలా మరచి పోతానమ్మా? ఇప్పుడు

## కోతులాట

నువ్విక్కడ కూర్చో. వసుగాడిని పిలిచి అన్నీ పరిష్కారం చెయ్యి—లేదా ఈ ఇంట్లో పచ్చి మంచి నీళ్లైనా ముట్టను" అన్నాడు గట్టిగా.

అరుగుమీదనుంచి వాసుదేవపతి లోపలికి వచ్చి "ఇప్పుడు పరిష్కారం ఏమిటి? అర్థంలేని మాటలు. దాన్ని పిలిచి దండించమంటావా?" అన్నాడు చిరు కోపంగా.

"ఎవరినీ దండించ నక్కరలేదు. మీ మనసులో ఉన్నదేదో మీరిద్దరూ చెప్పేయండి. మీ సంసారం విడిగా పెట్టుకోవాలనుంటే చెప్పు. నువ్వేదో నీ ఆర్జనంతా మాకే పెడుతున్నట్లు చెబుతుంది నీ పెళ్ళాం—పోనీ మీ సంసారం మీరే చూసుకోండి"


సావిత్రి సౌందర్య రహస్యం

'లక్స్ నా చర్మసౌందర్యానికి దివ్యమైనది' అన్నది ఆమె




అది సౌందర్య కారి - అసౌమ్యమైన లక్స్ మరగ !
నా చర్మమును మృదువుగాను, సొగసుగాను వుంచుచున్నది....
పరిమళమైన లక్స్ వుండగా మరియొకటి నా కెందుకు ! మీకు కూడాను !

లక్స్ టాయిలెట్ సబ్బు

సినీమా తారలకు సౌందర్యమునిచ్చే శుద్ధమైన, సౌమ్యమగు సబ్బు

4 వానవెల్లి రంగులలోను, తెలుపులోను వున్నది.

LTS. 148-140 TL

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి

# నెర్వోటాన్

నరముల బలహీనతకునూ, రక్తపోటుకునూ రామబాణము. అనుభవయుక్తముగా చేయబడినది.
8 ఔ. సీసా 5-75, పోస్టేజి 1-75.
ఇండియన్ మెడిసన్ హౌస్,
విజయవాడ-2.

# పాదాలలో ఆనెలు

పాదాలలో ఆనెలు, కండలు పెరిగి, వ్రేళ్ల పాతుకుపోయి విదము నేలపై బెట్టలేక రాళ్ళు తగిలిన త్రొక్కినపడు వారు పైపూతగా వాడిన వ్రేళ్లతోసహా మాయంచేయగల సంజీవి. వెల పోస్టు ఖర్చులతో రు. 4-25 న.పై.
కొక్కోకము చిత్రపటములు గలది. రు. 1-50
దాంపత్య రహస్యములు ... రు. 3-00
తెలుగు హిందీ స్వయంశిక్ష రు. 4-50
పోస్టు ఖర్చులు ప్రత్యేకము.
ప్రభ అండ్ కో.
3, మలయ పెరుమాళ్ వీధి, మద్రాసు-1.



# జామ్-బక్

## పాదముల వాపు నొప్పిని శమనపర్చి నివారించును

కాళ్లవాపులు, వ్రణములు, కురుపులు, కాలినపుండ్లు విషగాయములు, జామ్-బక్ గొప్ప చర్మ ఆయింట్‌మెంటుతో త్వరలో మానును. జామ్-బక్ చర్మంలోకి పోయి, గుణమిచ్చే ఔషధము దీనిలో జంతు క్రొవ్వులు మూనెలు లేవని గ్యారంటీ చేయబడినది.

Zam-Buk



జామ్-బక
మూలికా బామ్

ఇది మందుల వ్యాపారు లందరివద్దను దొరకును.
టి.ఇ. ఫుల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ బొంబాయి.

మద్రాసు స్టేటుకు సోల్ డిస్ట్రిబ్యూటర్లు:
మెస్సర్స్. మోతి & కం, మద్రాసు-1.


# కోతులాట

లన్నాడు గబగబా.

వాసుదేవపతి క్షణం సేపేమీ మాట్లాడలేక పోయాడు. అలానే కూర్చొండి పోయేసరికి బలరామయ్య తల్లి నుద్దేసిస్తూ "చూసావే అమ్మా! వీడు ఇంతకాలం దాచాడిది. వీడు విడిపోయి బాగు పడతానంటేనే కాదన్నానా. ఇప్పుడు బయట పడేసరికి తేలు కుట్టిన దొంగలా మాట్లాడక ఎలా చూస్తున్నాడో" అన్నాడు గట్టిగా.

వాసుదేవపతి అన్న వంకా, తల్లివంకా బిత్తర బోయి చూస్తూ—"అది కాదన్నయ్యా. నేనేమీ.." అనబోయాడు.

బలరామయ్య వినలేదు.

"చాలురా వసూ! ఇక మాట్లాడకు. నీకు ఎలా ఈ ఇంట్లో భాగం కావల్సినా ఇస్తాను. రేపు చెప్పేయి" అంటూ తువ్వాలుమీద వేసుకొని వీధిలోకి వెళ్ళిపోయాడు.

వాసుదేవపతి నిర్ఘాంతపోయి అలానే చూస్తూ ఉండిపోయాడు.

ఇక చక్కబడదనిపించింది. రాత్రంతా అలానే కూర్చుండిపోయాడు. మరునాడు ప్రొద్దుటే ఊరున పడి ఇల్లు వెతుక్కొని వచ్చాడు.

బట్టలు ఒక రేకు పెట్టెలో సర్ది అది మాత్రం తీసుకొని కొడుకు, భార్యతో బయటకు వస్తూ అన్న దగ్గరకు వెళ్ళి "నువ్వు చెప్పినట్లే వెళుతున్నా నన్నయ్యా—నీ దయ ఉన్నప్పుడు మా ఇంటికి రా" అని కన్నీళ్లు పెట్టుకున్నాడు వాసుదేవపతి.

బలరామయ్యకు కన్నీళ్లు జలజల రాలేయి. ఇలా ఇంట్లోంచి పోతాడనుకోలేదు.

"నిన్ను వేరేగా ఉండమన్నాగానీ, వేరే ఇంటికి పొమ్మనలేదు. నీకక్కరలేని ఇల్లు నా కెందుకు" అన్నాడు గాద్గదికంగా.

"ఈ ఇల్లు నీదే—" అన్నాడు వాసుదేవపతి కన్నీళ్లు తుడుచుకొని.

"దీంట్లో నీ భాగం కూడా ఉంది" అన్నాడు గంభీరాన్ని తెచ్చిపెట్టుకొంటూ.

"నాకేమీ వద్దన్నయ్యా—అమ్మ నీ దగ్గరే ఉంటుంది. ఆవిడ భాగంగా అది ఉంచేయి—వస్తాను" అని తల్లి దగ్గరకు వెళ్ళి ఆవిడ పాదాలకు నమస్కరిస్తూ, "నువ్వు బాలన్నయ్య దగ్గరే ఉండమ్మా. నీకు దయ ఉంటే రావాలనుకున్నప్పుడు రా" అన్నాడు బాధగా.

పారిజాతం వచ్చి అత్త పాదాలను తాకి "వెళ్ళొస్తా నత్తయ్యా" అన్నది.

ఆవిడ అలా శిలా ప్రతిమలా కూర్చొనుండి పోయింది. దీనికంతా కారణం తానుగా బాధ పడుతున్నది.

తానే గనుక కోడళ్ళిద్దరూ నోళ్ళు చేసుకున్నప్పుడు గద్దించిఉంటే ఇలా జరక్కపోయే దేమోననిపించింది. ఎలాగైనా వాళ్ళూ వాళ్ళూ ఒకటి. ఇవాళ పోట్లాడుకొని రేపు ఒకటవుతా రనుకున్నదేగాని ఇలా కొడుకులు నిముషాలమీద విడిపోతారనుకోలేదు. మొదట్లోనే ఈ విషపు చెట్టుని, గిల్లివేస్తే పెరిగి ఉండేది కాదని తనలో తాను కుళ్ళిపోతూ ఉన్నది.

వాళ్లు వెళ్ళిపోయారు. ఇల్లు పాడు బడ్డట్టని పించింది బలరామయ్యకు. తానెంత తొందరపడ్డాడో ఇప్పుడు తెలుస్తూ ఉంది.

ఎప్పుడన్నా వాసుదేవపతి లోటు తలచుకుంటు న్నప్పుడు రుక్మిణమ్మ ఎదురు పడితే—"ఈ ఇల్లు హాయిగా ఉందా నీకు. ఏలుకో నువ్వొక్కదానివే" అనేవాడు మొదటి రోజుల్లో. "వసు ఈ భారమంతా నా నెత్తిమీద కెక్కించి వెళ్ళాడు" అని గొణుక్కునేవాడు ఎవ్వరూ లేనప్పుడు.

* * *

ఇల్లు వదలి వెళ్ళగానే వాసుదేవపతిని అన్నీ వదలిపోయాయి. ఒక్కసారిగా కాంట్రాక్టరు దివాళ తీసా నన్నాడు.

ఊర్లు వదలి ఊర్లు తిరిగాడు. ఉద్యోగం కోసం. అప్పుడప్పుడూ అనిపించేది—"అన్నయ ఉసురు తగులుతూంది. గర్వంగా ఇల్లు వదిలానే ఏంబావుకుందామని?"—అని.

ఈ ఊరి నీళ్ళు పడక పిల్లాడికి జబ్బు చేసి గాబరా పెట్టింది. వాడు దేవుడి దయవల్లనిం కులాసాగా ఉన్నాడులే అనుకుంటుండగా పారిజాతం మంచం పట్టింది. రెండేళ్ళ నాటి పారిజాతాన్ని చూస్తే ఇప్పుడు గుపర్తు పట్టలేము.

అలవాటు పడ్డ కాళ్ళు గుమ్మంలో ఆగాయి. క్షణమాగి లోపలికి అడుగు పెట్టాడు వాసుదేవపతి.

మాధవుడు తల్లి పక్కలో ఉన్నాడు. ఏడేళ్ల వాడు. బహు అర్భకు డవటంచేత నాలుగేళ్ళవాడులా ఉంటాడు.

వీధి తలుపు చప్పుడు విని దిగి వచ్చి తండ్రిని చూడగానే—"నాన్నా! అన్నం తిన్నా" అన్నాడు సహజమైన కీచు గొంతుకు నీరసంతో తోడుగా.

పారిజాతం ప్రక్కకు ఒత్తిగిలి భర్తనుచూసి ప్రాణంలేని స్వరంతో "ప్రొద్దుటనగా ఏమీ తినకుండా వెళ్ళేరు. ఎండలో పరగడుపున తిరక్కండంటే వినరు" అన్నది.

భార్య మాటలు వినిపించుకోకుండా గూట్లో సీసా పెట్టి కొడుకును దగ్గరకు తీసుకొని "నువ్వే పెట్టుకు తిన్నావట్రా!" అన్నాడు ఆప్యాయంగా తల నిమురుతూ.

"ఆహ—కాదూ— అమ్మ పెట్టింది" అన్నాడు తల్లివంక చూస్తూ మాధవుడు.

భార్య లేచి పెట్టిందనగానే విసుగ్గా "నిన్ను లేవద్దన్నానా! డాక్టరు పక్కలోంచి కదలవద్దని చెప్పలా" అన్నాడు.

"వాడు ఆకలో మొర్రో అంటుంటే ఏం చేసేది! ఇంతసేపు ఎక్కడ తిరిగారు?" అన్నది.

"అలానే అక్కడ పెట్టిన జావ తాగక పోయావా" అన్నాడు భార్య వంక చూస్తూ.

"ఓపిక లేకపోయింది. ఎలాగో వాడికి పెట్టి వచ్చి పడుకున్నా—"

ఆవిడ కంఠంలోనే ఎంత ఆయాస పడిందో తెలుస్తూనే ఉన్నది.

వాసుదేవపతి జావ తెచ్చి పక్క ప్రక్కనే పెట్టాడు.

"ప్రొద్దుటనుంచి ఏమన్నా తిన్నావా!" అన్నాడు ఆవిడ వంక చూస్తూ.

"ఆ—ప్రొద్దున కాఫీ అంతా తాగలేకపోయాను. కొద్దిగా మిగుల్తే నిన్న రాత్రి రొట్టె ముక్కల్ని వేసుక తిన్నా"

గూట్లో మందుసీసా తీసి గాజు గ్లాసులో పోసాడు.

"జ్వరం పోయిందిగా—నీరసం. అదే తగ్గు

కుంది. ఇంతింత డబ్బు తగలేసి ఎందుకా మందు లన్నీ'' అన్నది బాధగా.

పారిజాతం వైపు చూడకుండా మోతాదు పూర్తిగా గ్లాసులో పడింది, లేనిదీ చూస్తూ, ''నేను చావకుండా బతికుండటానికి—'' అన్నాడు వాసుదేవపతి.

భర్తమాట కర్కశంగా గుండెకు తగలగానే దుఃఖం కట్టలు తెంచుకొచ్చింది. అటు తిరిగి మెల్లగా తనలో తాను ఏడవ సాగింది.

వాసుదేవపతి మంచంమీద కూర్చొని—''ఊఁ మందు తాగు'' అన్నాడు.

పారిజాతం ఇటు తిరగలేదు. అలానే ఉండి పోయింది.

''మందు తాగు'' అన్నాడు మళ్లీ.

పారిజాతం కన్నీళ్లు తుడుచుకుంటూ— ''వద్దు'' అన్నది ఏడుపు కంఠంతో.

''ఊఁ—ఇటు తిరుగు. ఏమిటది'' అన్నాడు.

పారిజాతం భర్తవైపు తిరిగి ''ఎందుకంతలేసి మాటలంటారు. ఇప్పుడు నేను పడుతున్నది చాలదా'' అన్నది కొద్దిగా బిగ్గరగా వణుకుతున్న స్వరంతో.

పారిజాతం చుట్టూ చెయ్యివేసి కూర్చోబెడుతూ —''నువ్వు నన్ను అర్థం చేసుకోవు పారిజాతం. ఈ మందులు మాకులకు డబ్బు తగలేస్తున్నా నంటావు. నువ్వు లేచి తిరక్కపోతే నేనెలా పని లోకి పోతాను'' అన్నాడు.

పారిజాతం భర్త చేతిలో మందు తీసుకొని త్రాగి గ్లాసు తిరిగి అతడికిచ్చివేసింది.

ఆమె వంక చూస్తూ—''నువ్వు బ్రతికుంటేనే నేను బ్రతికేది. నువ్వెప్పుడు లేవో నేనూ ఉండను'' అన్నాడు. అతడి కంఠం బిగుసుకు పోయింది.

పారిజాతం మాట్లాడలేదు. భర్త వంక దీనంగా బాధగా సంతృప్తిగా చూసింది.

''నీ సుఖం గూర్చి నాకేం తెలుసు. నీవు కోరిన దానిని ఏది వద్దన్నాను. నువ్వు కాదన్న దానిని దూరంగా తోసి వచ్చానే'' అన్నాడు ఆవిడను వెండుకోబెట్టి.

పారిజాతానికి తెలుసు. ఇది తన అన్నను, తల్లినీ వదలి వచ్చిన సంగతని. ఈ బాధలకు అదే కారణ మని అతనూహిస్తున్నాడని ఇప్పుడనిపించింది. మాట్లాడకుండా తాజేసిన అపరాధాన్ని తలచు కుంటూ అలానే భయంగా చూసింది.

''వాళ్ళకూ మనకూ ఋణం తీరిపోయింది'' అన్నాడు.

ఇద్దరూ కొద్దిసేపు మాట్లాడలేదు.

భర్త గాంభీర్యాన్ని భరించలేక ఏదో మాట్లాడా లన్నట్లు—''ఇన్ని ఉత్తరాలు వ్రాసినా అత్తమ్మ గారైనా రాలేదు'' అన్నది మెల్లగా.

వాసుదేవపతి మనసులో ఎక్కడో దాగిన కోపం బయటకు వచ్చింది.

''ఏ ముఖం పెట్టుకు వస్తుంది. ఈనాడు కష్టాల్లో పిలుస్తున్నాం. అప్పట్లో—అందరినీ వదలి రాలేదూ'' అన్నాడు గట్టిగా.

పారిజాతం మాట్లాడలేదు. భర్త వంక చూడ లేక తల పక్కకు త్రిప్పుకుంది.

''నిజం పారిజాతం—ఇది బాలన్నయ్య శాపం. ఆయన ఉసురు తగులుతున్నది. ఇదంతా మనం చేతులారా చేసుకున్నదే'' అన్నాడు తిరిగి బాధగా.

అలానే ముఖం చాటు చేసుకొని గొంతలో మాట గొంతులో కూరుకుపోతుండగా—''నేను పాపిష్టిదాన్ని'' అన్నది.

వాసుదేవపతి పారిజాతం వీపుమీద చెయ్యివేసి ఓదార్పుగా నిమురుతూ కొంతసేపు మాట్లా డక ఎటో చూస్తూ ఉండిపోయాడు.

మెల్లగా ''పారిజాతం! నిన్న ప్రొద్దుట భగ వంతరావు కలిసాడు. ఆయన అన్నయ్యకు బాగా తెలుసు. ఆయనతో అంతా చెప్పాను. వెళ్ళి కబురు చేస్తా నన్నాడు'' అన్నాడు. వాసుదేవపతి ఏదో మనసులో పొడమిన ఆశను వెలువరించ యత్నిస్తూ.

పారిజాతంలో ఈ ఆశ ఎప్పుడో చచ్చిపోయింది, పిల్లవాడికి ప్రమాదంగా ఉందని ఎన్ని ఉత్తరాలు వ్రాసినా రాలేదు. ఇప్పుడు తన కొరకు వస్తారా!

భర్త వంక చూసి — ''నేను బ్రతికుండగా వాళ్లు రారు. నేను చేసిన పాపం నాకు తెలుసు'' అన్నది గాద్గదికంగా.

వాసుదేవపతి బాధగా భార్య వంక చూసాడు. భర్త చేతిని తన చెంపపైకి పెట్టుకొని తిరిగి దుఃఖపు జీరగల కంఠంతో — ''రారు. వాళ్లెవ్వరూ మన గుమ్మం తొక్కరింక'' అన్నది.

బయట తలుపు పెద్ద పెట్టున కిర్రు శబ్దం చేస్తూ తెరుచుకున్నది. అడుగుల చప్పుడు వినిపిం చింది. మాధవుడు తండ్రిని అనుకొని ఉన్నవాడల్లా గది గుమ్మంలోవచ్చి ఒక్క క్షణం పరీక్షగా చూసి ఆనందంగా ''నాయనమ్మో—అమ్మా—నాయనమ్మ'' అన్నాడు.

పారిజాతం శరీరం జల్లుమన్నది. రక్తం చల్ల బడుతున్నట్లనిపించింది. వాసుదేవపతి ముఖం పాలి పోయింది. మంచం మీదనుండి లేచాడు.

గది గుమ్మంలో దైన్యమూర్తిలా తల్లి నిలచి ఉన్నది. మాధవుడు నాయనమ్మ కాళ్ళను చుట్టి వేసాడు. వాడిని దగ్గరకు తీసుకొని కోడలి మంచం దగ్గరకు వచ్చింది.

అప్పటివరకూ గొంతున దాచిన దుఃఖం ఆగ లేదు. అత్తకు ముఖం చూపలేక తలావలకి తిప్పు కొని ఏడవసాగింది పారిజాతం.

కోడలిమీద చెయ్యివేసి, నోటి మాట రాక కొడుకు వంక చూసింది. నిర్జీవ దృక్కులతో కన్నీరు కార్చుతూ గుమ్మానికి జార్లబడి నిలబడ్డాడు వాసు దేవపతి.

మాట పెగలి రాక జీరపోయిన కంఠంతో గాద్గదికంగా కొడుకువంక చూస్తూ — ''వసు! మంచి శిక్ష వేసావు. నిన్ను ఇంట్లోనుండి వెళ్ళనిచ్చి నందుకు మంచి శిక్ష వేసావురా నాయనా! ఇక చాలు. నా పిల్లాడినీ, కోడల్నీ ఎంతకుతెచ్చి మా మీద కోపం తీర్చుకున్నావురా. ఈ శిక్ష చాలురా'' అని భావురుమని ఏడ్చింది.

ముఖం పక్కకు తిప్పుకొని దుఃఖాన్ని కంఠంలో బిగించి పట్టుకున్నాడు వాసుదేవపతి.

ఆ దుఃఖంలో స్పృహ కొచ్చినట్లుగా ఆగి — ''వసు! వెళ్ళు బయట అన్నయ్య ఉన్నాడు'' అన్నది.

పారిజాతం, వాసుదేవపతులు ఉలిక్కిపడ్డారు. పారి జాతంలో మిగిలి ఉన్న ప్రాణం పోతున్నట్లనిపిం చింది. భర్త వైపు చూసి లేవ ప్రయత్నించింది. వాసుదేవపతి నిర్జీవంగా గది దాటి వెళ్ళాడు.

తల్లి మాటలు వినబడుతున్నాయి — ''నువ్వు పడుకో పారిజాతం! మీరు వెళ్ళగానే ఆ ఇల్లు అమ్మే సాడు పెద్దోడు. ఆ ఎడ్రసుకు రాసిన ఉత్తరాలు మా కొక్కటీ చేరలేదే. ఇవాళ భగవంతరావు వచ్చాడు దేవుడిలాగ. వెంటనే మీ బావ, నేనూ వచ్చాము'' అన్నది ఏడుస్తూ—

బయట నిలబడ్డ బలరామయ్యకు లోపలి ఏడుపు వినపడగానే నాల్గు అడుగులేసి ఆగిపోయాడు. తమ్ముడు ఎదురుగా రావటం చూసి గోడ వైపు తిరిగి కన్నీళ్ళు తుడుచుకున్నాడు.

వాసుదేవపతికి అన్నను ఎలా పలకరించాలో తెలీలేదు. గోడకు తలాన్చి నిలబడ్డ బలరామయ్య దగ్గరగా వచ్చి ''బాలన్నయ్యా'' అన్నాడు.

బలరామయ్య దుఃఖంతో వణికిపోతూ ముఖం కండువాతో కప్పుకొని ''వసూ! ఈ పాపివాడి ముఖం చూడకరా!—వద్దు......నా ముఖం చూడకు' అని చిన్న పిల్లవాడిలా ఏడుస్తూ తమ్ముడి భుజం పై వాలిపోయాడు. ★

